



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    PEN POWER TELUGU DAILY    ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12  సంచిక : 85  పేజీలు :8  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : విశాఖపట్నం  సోమవారం 1 డిసెంబర్ 2025  వెల : 1/-రూ ॥

VOLUME :12  ISSUE :85  PAGES :8  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : VISAKHAPATNAM  MON 1 DECEMBER 2025  PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం...

# 11 మంది దుర్మరణం



- శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపంలో ఘటన
- కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో పెరగనున్న మృతుల సంఖ్య
- వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద బస్సు ప్రమాదం

తమిళనాడులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శివగంగ జిల్లాలోని తిరుపత్తూర్ సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఒక చిన్నారితో సహా 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఒక బస్సు తిరుప్పూర్ నుంచి కారైకుడి వస్తుండగా... మరో బస్సు కారైకుడి నుంచి దిండిగల్‌కు ప్రయాణిస్తోంది. తిరుపత్తూర్ వద్దకు రాగానే ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 2లో..



## ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలి

- ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలని ఈసీని కోరిన టీడీపీ
- ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం అనంతరం లావు శ్రీకృష్ణ దేవరాయలు వెల్లడి
- ఇతర రాష్ట్రాల్లో ఈసీ చేపట్టిన సవరణను స్వాగతిస్తున్నామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇదే తరహాలో ఏపీలోనూ ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ పార్లమెంటరీ

వివరాలు 2లో..

# ‘పేదల సేవలో’ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి..

## టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు సూచన

- నిరంతరం ప్రజల్లో ఉండాలని హితవు
- ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న టీడీపీ అధినేత
- పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలన్న చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:రాజకీయ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే వారే నాయకులుగా రాణిస్తారని ఆయన చెప్పారు.

ఈమేరకు పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘పేదల సేవలో’ కార్యక్రమంలో పార్టీ నాయకులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలని నేతలకు తెలిపారు. ‘పేదల సేవలో’ కార్యక్రమంలో నాయకుల భాగస్వామ్యం ప్రస్తుతం 25 వేలకు చేరిందని చంద్రబాబు వెల్లడించారు.

## అధికారులు ప్రతి కాల్ కు స్పందించాలన్న హోంమంత్రి అనిత



- దిత్వా తుపానుపై హోంమంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష
- 5 జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు
- దక్షిణాంధ్రలో భారీ వర్షాలు, బలమైన గాలుల హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో ఏర్పడిన ‘దిత్వా’ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. హోంమంత్రి అనిత సచివాలయంలో ఉన్నతాధికారులు, 5 జిల్లాల కలెక్టర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సహాయం కోసం వచ్చే ప్రతి కాల్‌కు తక్షణమే స్పందించాలని, ప్రాణనష్టం జరగకుండా చూడటమే లక్ష్యమని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో భాగంగా ఆర్టీజీఎస్ స్టేట్ సెంటర్ నుంచి నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి

వివరాలు 2లో..

## నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ... 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో 37 మంది మావోయిస్టులు లొంగుబాటు
- వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు
- ప్రభుత్వ ‘పూనా మర్గం’ పునరావాస విధానంతోనే మార్పు
- లొంగిపోయిన వారికి రూ. 50 వేల ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు
- గ్రామస్తుల మద్దతు కరువవడంతోనే లొంగుబాటని వెల్లడి

వివరాలు 2లో..



## తరుముకొస్తున్న దిత్వా తుపాను...

### 20 సెం.మీ పైగా వర్షం పడే అవకాశం




- నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ఆకస్మిక వరదల హెచ్చరిక
- మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- తీరం దాటకుండానే బలహీనపడనున్న దిత్వా తుఫాను
- దక్షిణ కోస్తా, రాయలసీమలో అతి భారీ వర్షాలు, ఈదురుగాలులు
- రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అధికార యంత్రాంగం అప్రమత్తం

వివరాలు 2లో..

## ‘ఐబొమ్మ’ వెబ్‌సైట్‌లో నేను కూడా సినిమాలు చూశాను

### సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు

- ‘ఐబొమ్మ’ రవిని కాదు, సినిమా మాఫియాను ఉరితీయాలన్న నారాయణ
- వందల రూపాయల టికెట్ ధరల వల్లే ఇలాంటివి పుట్టుకొస్తున్నాయని వెల్లడి
- వ్యవస్థలోని లోపాలే రవి లాంటి వారిని తయారుచేస్తున్నాయని వ్యాఖ్యలుస
- ఒక హిడ్మాను చంపితే వెయ్యి మంది పుడతారన్న నారాయణ



వివరాలు 2లో..

## ఏపీ హక్కుల కోసం పార్లమెంటులో పోరాడాలని వైసీపీ ఎంపీలకు జగన్ పిలుపు

- నేటి నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు
- రైతుల సమస్యలపై పార్లమెంటులో గట్టిగా పోరాడాలని ఎంపీలకు జగన్ సూచన
- తుపాను నష్టపరిహారం, కనీస మద్దతు ధర కోసం పట్టుబట్టాలని ఆదేశం
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపు
- ఉపాధి హామీ కార్డుల తొలగింపు, శాంతిభద్రతల క్షీణతపై గళమెత్తాలని దిశానిర్దేశం

వివరాలు 2లో..



## భారత క్రీడారంగానికి ఇది ‘సూపర్ హిట్’ నెల: ‘మన్ కీ బాత్’లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం



- మహిళల క్రికెట్, కబడ్డీ ప్రపంచకప్‌ల విజయాలపై ప్రత్యేక అభినందనలు
- అంధుల మహిళా క్రికెట్ జట్టు విజయం చరిత్రలో నిలిచిపోతుందన్న ప్రధాని
- డెఫ్లింపిక్స్, వరల్డ్ బాక్సింగ్‌లోనూ పతకాల పంట పండించిన భారత క్రీడాకారులు
- విజేతల ధైర్యం, పట్టుదల దేశానికే స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

వివరాలు 2లో..

# ఏపీ హక్కుల కోసం పార్లమెంటులో పోరాడాలని వైసీపీ ఎంపీలకు జగన్ పిలుపు

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంతో పాటు, ఆంధ్రప్రదేశ్ హక్కుల సాధన కోసం పార్లమెంటులో గట్టిగా పోరాడాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న  అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీలతో సమావేశమయ్యారు. తుఫాను నష్టంతో పాటు, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్ పీ) లభించకపోవడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ అంశాలపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు.'మొంథా' తుపాను కారణంగా కోస్తా జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, సర్వం కోల్పోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాయని జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తమ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా నేరుగా పంటలను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించిందని, ఇప్పుడు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో రైతులు దళారుల చేతుల్లో నలిగిపోతున్నారని ఆవేదన చెందారు. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, కంది, అరటి, మిర్చి, మామిడి వంటి అన్ని ప్రధాన పంటలకు మద్దతు ధర పడిపోయిందని, దీనివల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించి, రైతులకు తక్షణమే అత్యవసర సహాయ నిధులతో పాటు, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేలా ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రీమియం భారం లేకుండా ఉచిత పంటల బీమా అందించామని, ఇప్పుడు ఆ పథకాన్ని నిలిపివేయడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ విమర్శించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందడం లేదని, ఈ-క్రాప్ నమోదును నిలిపివేయడంతో పరిహారం పొందేందుకు కూడా రైతులు అనర్హులుగా మారుతున్నారని అన్నారు. మిర్చి రైతులకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పి మోసం చేశారని, మామిడి రైతులను కూడా ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు.

ఇదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా 18.63 లక్షలతో సహా మొత్తం లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులను రద్దు చేయడంపై జగన్ మండిపడ్డారు. దీనివల్ల గ్రామీణ కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని, వెంటనే అర్హులైన వారి కార్డులను పునరుద్ధరించి, పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేయాలని ఎంపీలకు సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంటును ముక్కలు చేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించి, వేలాది మంది కార్మికుల జీవితాలను కాపాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాజకీయ కక్ష సాధింపులు పెరిగిపోయాయని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆరోపించారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, ఉపాధి కల్పన, హక్కుల పరిరక్షణ కోసం పార్లమెంటు వేదికగా గట్టిగా పోరాడాలని జగన్ తన ఎంపీలకు స్పష్టం చేశారు.

## ఎడిటర్ వ్యూ

### రాజధానికి అసలు ఎన్ని ఎకరాలు కావాలి? భూసమీకరణ ఆగదా?

ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలి. ప్రజలకు తాము తీసుకుంటున్న నిర్ణయాలను వివరించాలి. గోప్యంగా ఉంచితే అనేక అనుమానాలు బయలుదేరతాయి. రాజధాని అమరావతి విషయంలోనూ ఇదే జరుగుతుంది. గతంలో మొదటిదశలో రైతుల నుంచి సేకరించిన 34 వేల ఎకరాలు, ప్రభుత్వానికి సంబంధించిన భూములు మొత్తం యాభై నాలుగు వేల ఎకరాలున్నాయి. అయితే ఈ యాభై నాలుగు వేల ఎకరాల్లో కేవలం ఏడు వందల ఎకరాలు మాత్రమే మిగిలాయని ప్రభుత్వం చెబుతుంది. మరొకసారి రెండో విడత భూసేకరణకు సిద్ధమయింది. దీంతో అనేక అనుమానాలు ప్రజలు, రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రధాన మీడియాల్లోనూ, సోషల్ మీడియాల్లోనూ అనేక రకాలుగా ప్రచారం జరుగుతుంది. కప్పి ఉంచడం వల్ల రెండో విడత సమీకరణపై పడే అవకాశముంది.

**యాభై నాలుగువేల ఎకరాల్లో...**

రాజధాని పేరుతో సేకరించిన తొలివిడత 54 వేల ఎకరాల్లో రాజధాని ఎక్కడ అన్నది చెప్పాలన్నది ప్రజల నుంచి వినిపిస్తున్న ప్రశ్న. ముంబయి ఛత్రపతి విమానాశ్రయం 1850 ఎకరాల్లో ఉంటే అమరావతికి ఐదు వేల ఎకరాలు ఎందుకన్న ప్రశ్న తలెత్తుంది. పైసా తీసుకోకుండా రాజధాని కోసం రైతులు భూములు ఇస్తే పప్పు బెల్లాలుగా ఇష్టమొచ్చినట్లు పంపిణీ చేయడం ఏంటన్న ప్రశ్న తలెత్తుంది. ఇంజినీరింగ్ కళాశాలలకు ఎకరం యాభై లక్షలకు కేటాయించినా కనీసం రాజధాని రైతుల పిల్లలకు ఆ కళాశాలల్లో రాయితీ కూడా ఇవ్వడం లేదు. తామిచ్చిన భూముల్లోనే తమపై పెత్తనం ఎందుకని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. మొదటి దశలో 25 గ్రామాల నుంచి 34 వేల ఎకరాలు తీసుకున్నారు. 29 వేల మంది రైతులు భూములు ఇచ్చారు. వారికి ఇచ్చిన ప్లాట్లకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం ఎందుకు సిద్ధమవ్వాలని వారు ప్రశ్నిస్తున్నారు.

**పదకొండేళ్ల నుంచి...**

ఒకవైపు తమ సమస్యలు పదకొండేళ్ల నుంచి అలాగే ఉన్నా, మరికొందరిని బలి చేయడానికి ఎందుకు నిర్ణయాలు తీసుకుంటారని రాజధాని రైతులు ప్రశ్నిస్తున్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కూడా ఇదే ప్రశ్నను లేవనెత్తారు. రాజధానికి రెండో విడత భూసమీకరణకు భూములిచ్చి తొలి విడత ఇచ్చిన రైతులకు అన్యాయం చేయవద్దని ఆయన కోరుతున్నారు. అసలు యాభై నాలుగు వేల ఎకరాలకు ఎవరెవరికి ఇచ్చారని శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ఒకటి అభివృద్ధి జరిగిన తర్వాత మరొక దానిని అభివృద్ధి చేయడం కోసం సేకరించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ పనిచేయకుండా రాజధాని నిర్మాణానికి ఎన్ని వేల ఎకరాలు కావాలో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

**మొదటి దశలో ఇచ్చిన భూముల్లో...**

మొదటి దశలో ఇచ్చిన భూముల్లో డిజైన్లు వేసి రాజధాని నిర్మాణానికి ఒకే అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు తాజాగా మలి విడత భూసమీకరణకు తాము ఎందుకు సహకరించాలన్న ప్రశ్న రైతుల నుంచి సూటిగా వినిపిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శకంగా రాజధాని భూముల విషయంలో వ్యవహరించాలని కోరుతున్నారు. అలాగని ముందుకు వెళితే తాము న్యాయస్థానాలను ఆశ్రయించక తప్పదని వడ్డే శోభనాద్రీశ్వరరావు లాంటి రైతు సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఏ రాష్ట్రంలోనైనా విమానాశ్రయం ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల దూరంలో ఉంటుందని, కానీ రాజధాని నడిబొడ్డులో విమానశ్రయం నిర్మాణం అవసరమా? ఇక గన్నవరం విమానాశ్రయాన్ని ఏం చేయనున్నారో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. మొత్తం మీద రెండో విడత భూసమీకరణ మాత్రం ప్రభుత్వానికి అంత తేలికగా కనిపించడం లేదు.

# అధికారులు ప్రతి కాల్ కు స్పందించాలన్న హోంమంత్రి అనిత

- మొదటి పేజి తరువాయి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. (నవంబర్ 30), రేపు (డిసెంబర్ 1) తుపాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. "ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అధికారులను ముందే నియమించాలి. ప్రజల నుంచి కంట్రోల్ రూమ్‌లకు వచ్చే ఒక్క కాల్‌ను కూడా విస్మరించకూడదు" అని అనిత గట్టిగా సూచించారు.బలమైన ఈదురుగాలులకు చెట్లు, హోర్డింగులు కూలే ప్రమాదం ఉన్నందున వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని, మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా, తాము అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్లు మంత్రికి వివరించారు. మరోవైపు, దక్షిణాంధ్ర జిల్లాల్లో గంటకు 50-70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రభుత్వం ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచింది. ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని, అధికారుల సూచనలు పాటించాలని హోంమంత్రి విజ్ఞప్తి చేశారు.

# తరుముకొస్తున్న దిత్వా తుపాను...

## 20 సెం.మీ పైగా వర్షం పడే అవకాశం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలు వణికిపోతున్నాయి. ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 20 సెంటీమీటర్లకు పైగా అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దీనివల్ల ఈ జిల్లాల్లో రేపు ఆకస్మిక వరదలు సంభవించవచ్చని తెలిపారు. ఇవాళ నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ప్రజలను అప్రమత్తం చేసింది. తుపాను ముప్పు దృష్ట్యా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు 'రెడ్ అలర్ట్' ప్రకటించింది.తుపాను ప్రభావంతో ఆదివారం దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ప్రకాశం, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో అక్కడక్కడా అతి భారీ వర్షాలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వర్షాలతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అప్పుడప్పుడు వాటి వేగం 80 కిలోమీటర్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఉత్తర కోస్తాలో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, సోమవారం వరకు మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది. కృష్ణపట్నం పోర్టులో మూడో నంబర్ ప్రమాద హెచ్చరికను, విశాఖపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, గంగవరం, కాకినాడ పోర్టులలో రెండో నంబర్ హెచ్చరికలను ఎగురవేశారు.

**అప్రమత్తమైన అధికార యంత్రాంగం**

తుపాను హెచ్చరికలతో రాష్ట్ర హోంమంత్రి వి. అనిత అధికారులను అప్రమత్తం చేశారు. విపత్తుల నిర్వహణ శాఖ ఇప్పటికే సహాయక చర్యల కోసం నెల్లూరు జిల్లా వెంకటగిరిలో మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించింది. మరో మూడు బృందాలను సిద్ధంగా ఉంచింది. ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ...

## 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దంతెవాడ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'లోన్ వర్రాటు', 'పూనా మర్గం' (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) పథకాలకు ఆకర్షితులై 37 మంది మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు. వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు.హింసామార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానంపై తమకు పూర్తి నమ్మకం ఉందని లొంగిపోయిన మావోయిస్టులు పేర్కొన్నారు. దంతెవాడలోని డీఆర్జీ కార్యాలయంలో పోలీసు, సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల సమక్షంలో వీరు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలు కూడా ఉన్నారు. వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ మాట్లాడుతూ.. "మా నిరంతర ప్రయత్నాలు, స్థానిక ప్రజల మద్దతు ఫలించాయి. అడవుల్లో జీవించడం కష్టంగా మారిందని, పోలీసులు అన్ని ప్రాంతాలకు చేరుకుంటున్నారని, గ్రామస్తుల నుంచి కూడా మద్దతు లభించడం లేదని లొంగిపోయిన వారు చెబుతున్నారు" అని వివరించారు.

లొంగిపోయిన వారిలో కొందరు సీనియర్ మావోయిస్టు కమాండర్లకు బాడీగార్డులుగా పనిచేసిన వారు కూడా ఉన్నారని తెలిపారు.ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం లొంగిపోయిన వారికి రూ. 50,000 ఆర్థిక సాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి వంటి అదనపు ప్రయోజనాలు అందిస్తారు. గత 20 నెలల్లో దంతెవాడ జిల్లాలో 165 మంది రివార్డు ఉన్న మావోయిస్టులతో సహా మొత్తం 508 మంది లొంగిపోయారని అధికారులు తెలిపారు. ఈ పరిణామం హింసారహిత బస్తర్ దిశగా వేసిన మరో కీలక అడుగు అని వారు అభివర్ణించారు.

# భారత క్రీడారంగానికి ఇది 'సూపర్ హిట్' నెల:

## 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

భారత క్రీడా రంగానికి గడిచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. పలు అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు" అని తెలిపారు.

అంతేకాకుండా, భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీ-ఫైనల్‌లో ఇరాన్‌పై 33%-%21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35%-%28 తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచారు. "మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుంది" అని మోదీ పేర్కొన్నారు.ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మన క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి.అయితే, ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయం తర్వాత తాను జట్టు సభ్యులను తన నివాసంలో కలుసుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు."మిత్రులారా, వీటన్నింటికన్నా ఎక్కువగా మన మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడంపై చర్చ జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ టోర్నమెంట్‌లో మన జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా గెలిచింది. ఈ జట్టులోని ప్రతి క్రీడాకారిణిని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారు. కేవలం రెండు రోజుల క్రితమే నేను ఈ జట్టును ప్రధానమంత్రి నివాసంలో కలిశాను. నిజంగా, ఈ జట్టు ధైర్యం, పట్టుదల మనకు ఎంతో నేర్పుతాయి. మన క్రీడా చరిత్రలోని గొప్ప విజయాలలో ఇదొకటి. ఇది ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం...

## 11 మంది దుర్మరణం

- మొదటి పేజి తరువాయి

తమిళనాడులో వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. నవంబర్ 24న తెన్కాశి జిల్లాలో రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు మరణించగా, 56 మంది గాయపడ్డారు. ఆ ప్రమాదానికి డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు సీఎం ఎంకే స్టాలిన్ రూ. 3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

# ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలి

- మొదటి పేజి తరువాయి

పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెం ట్ శీతాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, ఆదివారం ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఈ సమావేశంలో ప్రభుత్వం అన్ని పార్టీలను కోరింది. అయితే, ఇదే సమావేశంలో ప్రతిపక్షాలు ఓటర్ల జాబితా సవరణపై ఉన్న ఆందోళనలపై పార్లమెంటులో చర్చ జరగాలని పట్టుబట్టాయి.ఈ నేపథ్యంలో ఎన్డీయే మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ తరఫున లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ.. ఏపీలో ఓటర్ల జాబితా సవరణ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అఖిలపక్ష సమావేశంలో తాము పలు కీలక అంశాలను లేవనెత్తినట్లు తెలిపారు. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీ అంశంపై ఈ సమావేశాల్లో సమగ్ర చర్చ జరగాలని కోరినట్టు వివరించారు. ఈ వివాదం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్ జీవన్ మిషన్ గురించి కూడా ప్రస్తావించినట్లు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. ఈ పథకం అమలు విధానం, దాని ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చేకూరే ప్రయోజనాలపై స్పష్టత కోసం పార్లమెంటులో చర్చ జరపాలని కోరినట్లు చెప్పారు. దీనివల్ల పథకం అమలులో పారదర్శకత వస్తుందని, రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలు పూర్తిగా అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకునేందుకు వీలుగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో %బా×=% షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం మరో వారం పాటు పొడిగించింది. రాబోయే ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలను మరింత కచ్చితంగా, సమగ్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అండమాన్ నికోబార్ దీవులు, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. తాజా షెడ్యూల్ ప్రకారం, గణన ప్రక్రియను డిసెంబర్ 11 వరకు పొడిగించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 16న ప్రచురించి, 2026 జనవరి 15 వరకు అభ్యంతరాలు, చేర్పులకు అవకాశం కల్పిస్తారు. తదుపరి దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉంది.

# 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో నేను కూడా సినిమాలు చూశాను: సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు

సీపీఐ అగ్రనేత కె.నారాయణ 'ఐబొమ్మ' వెబ్‌సైట్ వ్యవహారంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐబొమ్మ రవిని శిక్షించడం కంటే అసలైన సినిమా మాఫియాను ఉరితీయాలని, అప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. తాను కూడా ఐబొమ్మలో ఉచితంగా సినిమాలు చూశానని ఈ సందర్భంగా నారాయణ వెల్లడించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.టికెట్ ధరలను రూ.600-700కు పెంచితే సామాన్యులు సినిమాలు ఎలా చూస్తారని ఆయన ప్రశ్నించారు. "కోట్లు ఖర్చుపెట్టి, టికెట్ ధరల కోసం అడుక్కుంటారు. సామాన్య ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం సాయం చేస్తుందా? కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వారిని ఐబొమ్మ రవి దెబ్బకొట్టారు" అని నారాయణ వ్యాఖ్యానించారు. ఒకరిని జైల్లో వేయడం వల్ల ప్రయోజనం లేదని, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలని సూచించారు.

వ్యవస్థలోని లోపాలను సరిచేయనంత కాలం ఇలాంటి వ్యక్తులు పుట్టుకొస్తూనే ఉంటారని నారాయణ హెచ్చరించారు. "ఒక ఐబొమ్మ రవిని జైలులో వేస్తే మరో వంద మంది వస్తారు. అదే విధంగా, మావోయిస్టు నేత హిడ్మాను చంపడం ద్వారా వెయ్యి మంది హిడ్మాలు పుడతారు" అని అన్నారు. వ్యవస్థాగత వైఫల్యాల వల్లే రవి లాంటి వారు తప్పుడు మార్గంలోకి వెళుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.వ్యక్తులను శిక్షించడం సమస్యకు పరిష్కారం కాదని, అసలు సమస్య వ్యవస్థలోనే ఉందని నారాయణ స్పష్టం చేశారు. ఈ వ్యవస్థే ఐబొమ్మ రవి లాంటి వ్యక్తులను సృష్టిస్తోందని, లోపాలను సరిదిద్దకపోతే భవిష్యత్తులోనూ ఇలాంటి వారు వస్తూనే ఉంటారని ఆయన పేర్కొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# ఆఫీసుకు ఆమడ దూరంలో కార్యదర్శి.




**భీమవరం గ్రామ సచివాలయం. కార్యదర్శి. నిర్లక్ష్య శైలి మార్చుకోవాలి..!**

**భీమవరం గ్రామ ప్రజలు.**

**సిబ్బంది మొత్తం తన గుప్పెట్లో. ఏక చత్రపతి పాలనా శైలి..**

**ఎన్ని మార్లు పై అధికారులకు. తెలిపిన అతని పై చర్యలు శూన్యం.**

**హుకుంపేట పెన్ పవర్ నవంబర్ 30**హుకుంపేట (భీమవరం): పౌర సేవలే లక్ష్యంగా, పారదర్శక పాలన అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటైన గ్రామ సచివాలయ వ్యవస్థ. భీమవరం సచివాలయం వద్ద గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా కుప్పకూలింది. సచివాలయానికి అడ్మినిస్ట్రేటివ్ హెడ్‌గా ఉండి, సిబ్బందిని నడిపించాల్సిన బాధ్యత గల కార్యదర్శి తీరుపై స్థానిక ప్రజలు, మరియు ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి పనితీరు కారణంగా ప్రభుత్వ లక్ష్యాలకు గండి పడుతోందని స్థానికులు వాపోతున్నారు.

**వారానికి రెండు రోజులే కార్యాలయానికి.**

స్థానికుల ఆవేదన ప్రకారం, గ్రామ కార్యదర్శి విధులకు హాజరయ్యే విషయంలో అత్యంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడు. అతను వారానికి కేవలం రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నాడు. ఒకరోజు కార్యాలయానికి వస్తే, ఆ తర్వాత రెండు రోజులు ముఖం చూపడం లేదనేది గ్రామస్తుల ప్రధాన ఫిర్యాదు. దీనివల్ల జనన మరణ ధృవపత్రాలు, మరియు పింఛన్ల దరఖాస్తులు, ఇతర ధ్రువీకరణ పత్రాలు వంటి అత్యవసర సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. తమ పనులు చేయించుకోవడానికి ప్రజలు పదేపదే సచివాలయానికి వచ్చి, నిరాశతో వెనుదిరుగుతున్నా పట్టించుకునే. నాధుడే కరువు అయ్యారని గ్రామ ప్రజలు వాపోతున్నారు.

**సర్పంచ్ ను సైతం లెక్కచేయని ధోరణి: అతని తీరు.నేనే సూపర్ సర్పంచ్. పాలనా తీరు.**

సచివాలయం సిబ్బందికి మార్గనిర్దేశం చేయాల్సిన కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా మిగతా సిబ్బందిలో కూడా సమన్వయం లోపించింది. ఈ వ్యవహారంపై సర్పంచ్ ఎన్నిసార్లు సూచించినా, గ్రామ కార్యదర్శి పట్టించుకోవడం లేదు. గ్రామ స్థాయిలో కీలక ప్రజాప్రతినిధి మాటకే విలువ ఇవ్వకపోవడం, తానే సర్పంచ్ అనుకుంటూ ఈ వ్యవస్థపై కార్యదర్శికి ఎంత ఉదాసీనత ఉందో తెలియజేస్తోంది. సర్పంచ్ మాటకు లెక్కలేకపోవడంతో సిబ్బంది కూడా క్రమశిక్షణ పాటించలేని పరిస్థితి ఏర్పడింది.

**సర్వే పేరుతో సామూహిక సిబ్బంది గైర్హాజరు:**

కార్యదర్శి నిర్లక్ష్యం కొనసాగుతుండగా, ఒకవైపు అత్యవసర పనుల నిమిత్తం సచివాలయానికి వెళ్లిన ప్రజలకు ఖాళీ కుర్చీలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ విషయంపై వివరణ కోరగా, మండల ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో మండల ఏఓ ( అడ్మినిస్ట్రేటివ్ అధికారి) ను సంప్రదించడం జరిగింది. సచివాలయం ఉద్యోగులందరూ ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య కార్యక్రమమైన రైతన్న మీ కోసం సర్వేను వేగవంతం చేసేందుకు క్షేత్ర స్థాయికి వెళ్లారని ఆయన వివరణ ఇచ్చాడు. అయితే, కనీసం ఒక్క ఉద్యోగిని కూడా సేవలు అందించడానికి కార్యాలయంలో ఉంచకుండా సామూహికంగా వెళ్లడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరలో ఒక ఉద్యోగిని ఏర్పాటు చేస్తామని ఏఓ హామీ ఇచ్చారు.

**ఉన్నతాధికారుల మౌనంపై ప్రశ్నలు ఎన్నో.?**

గ్రామ కార్యదర్శి ఇంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నా, అతనిపై పర్యవేక్షణ కొరవడటంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. కార్యదర్శిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన ఎంపీడీవో మౌనం దాల్చడం వెనుక ఆంతర్యం ఏమిటో?

**ఇంత నిర్లక్ష్యం జరుగుతున్నా జిల్లా కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు?**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే వ్యవస్థలో ఈ ధోరణి కొనసాగితే, ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరడం అసాధ్యం. ప్రజా సేవలకు విఘాతం కలిగిస్తున్న గ్రామ కార్యదర్శిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని భీమవరం సర్పంచ్ మరియు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఏ సి ఎల్ సీసన్ 2 విన్నర్ దేవ్-11

**విజేతలకు బహుమతులు అందజేసిన:13 వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు**




**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 30:** జీవీఎంసీ13వ వార్డు హెల్త్ సిటీగ్రౌండ్లో ఏసీఎల్ సీసన్ 2 క్రికెట్ టోర్నమెంట్ నవంబర్ 27నుండి 30 వరకు నిర్వహించారు.ఆదివారం ఫైనల్ మ్యాచ్ లో శ్రీకాకుళం జిల్లా టీమ్ దేవ్ 11 విన్నర్ గా నిలిచారు.మ్యాచ్ రన్నర్ ఆరిలోవకు చెందిన ఫ్రీడమ్ 11 వారు గెలిచారు. విన్నర్స్ కు ఒక లక్ష రూపాయలు, రన్నెర్స్ కు యాభై వేల రూపాయలు నగదు ఇవ్వడం జరిగింది.13వ వార్డు టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు ముఖ్య అతిధిగా పాల్గొని విజేతలకు ఛాంపియన్స్ ట్రోఫీ అందజేశారు,ఈ కార్యక్రమం లో వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడిబాలస్వామి.ఎస్సీ సెల్ అధ్యక్షుడు పట్టా నూకరాజు.పారిపిల్లి రామారావు,జనసేన నాయకులు నీలి సన్యాసిరావు. పారిపల్లి రామారావు. టోర్నమెంట్ సభ్యులు యూత్ బాయ్స్ తదితరులు పాల్గొన్నారు.



# జీవీఎంసీ12వ వార్డు అనుబంధ సంఘాల అధ్యక్షుల సమావేశం



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 30:**12వార్డు ఎస్ ఆర్ సి పి అధ్యక్షులు మొల్లి హేమంత్ ఆధ్వర్యంలోవార్డు అనుబంధ సంఘాల అధ్యక్షుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు.పాల్గొని అనుబంధాల సంఘాల అధ్యక్షులతో సమావేశమై పార్టీకి అనుబంధ సంఘాల కమిటీలు చాలా ముఖ్యమని, అధ్యక్షులు ప్రతి ఒక్కరూ వారి వారి కమిటీలో 8 మంది సభ్యులతో కూడిన కమిటీని వేసుకోవాలని,పార్టీకి కష్టపడే వ్యక్తులకు మాత్రమే నియమించుకోవాలని నిర్ణయించడం జరిగిందని తెలియజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి సత్తి మందారెడ్డి, బుర్రా సూర్యారావు,బంధం శీను,మొల్లి బాలకిరణ్,మొల్లి వెంకటరమణ,వార్డు అనుబంధ విభాగాల ప్రతినిధులు ఒమ్మి వెంకట అప్పారావు,కుర్రు సుజాత, బొట్ట కనకరాజు,బుడుమూరు వినోద్,బోధిరెడ్డి లక్ష్మి నెహ్రూలాల్,లగుడు శ్రీనివాసరావు,కిషోర్ రెడ్డి,తెలుగు కొండమ్మ , ధనలక్ష్మి జేమ్స్ పాల్,ఈగల అప్పలరాజు,బొట్ట శ్రీకాంత్ కార్యకర్తలు,మహిళా కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పాల్గొనండి.



**అరకులోయ పెన్ పవర్ 30:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టమకంగా తీసుకున్న ఎన్ టీ ఆర్ బరోసా పెన్షన్ ప్రతినెలా ఒకటో తేదీనే వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూటమి ప్రభుత్వం రూ. 4000 నుంచి 10,000 వేల వరకు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సోమవారం ఉదయం ప్రారంభం కానుంది. నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కూటమి ప్రభుత్వం సచివాలయ అధికారులతో టిడిపి నాయకులను కొందరిని అనుసంధానం చేసిన విషయం తెలిసిందే. అనుసంధానం చేసిన వ్యక్తులు సచివాలయ అధికారులతో సమన్వయం చేసుకొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలి. సచివాలయ అధికారులు కూడా ప్రభుత్వం ఎవరినైతే పెన్షన్ల పంపిణీ నిమిత్తం అనుసంధానం చేస్తుందో వారిని సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని కోరుతున్నాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఉదయం నుంచే పాల్గొని ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా చూడాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేస్తున్నామని ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

## కూటమి పాలనలో రైతాంగం సంక్షోభం

# రాష్ట్రం మొత్తం సంక్షేమం బీడీయాబీదం

**ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడ్డ మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 30** :రాష్ట్రంలో సాగు రంగం అత్యంత దుర్భర స్థితికి చేరుకుందని, కూటమి పాలనలో అన్నదాతల పరిస్థితి రోజు రోజుకు అధ్వాన్నంగా మారుతోం దని శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయ న, ప్రభుత్వం నిర్వహణలో ప్రతి రంగంలో వైఫ ల్యం స్పష్టంగా కనిపిస్తుందని, ఏ పంటకూ గిట్టు బాటు ధర లేక రైతు పూర్తిగా నష్టాల్లో కూరుకు పోయాడని తీవ్ర విమర్శలు గుప్పించారు.

రైతుకు యూరియా లేదు రియల్ ఎస్టేట్ కు ఎకరా రూ.1-రూ.100కి భూములు!

రైతులకు కనీస యూరియా కూడా అందించలేని ప్రభుత్వం, రియల్ ఎస్టేట్ కంపెనీలకు మాత్రం కోట్లు విలువ చేసే భూములను ఔదార్యంగా కేవలం ఎకరాకు రూ.1, రూ.100, రూ.1 లక్షకే కేటాయించడం దారుణమని బొత్స మండిపడ్డా రు. విశాఖలో భూసేకరణ, పంపిణీ పేరిట భారీ దోపిడీ జరుగుతోందని, బహిరంగ టెండర్లు లేకుండానే నచ్చిన వారికి భూములు అప్పగించ డం అవినీతి పరాకాష్ట అని ఆయన విమర్శించా రు.

గత ప్రభుత్వ పథకాల పేర్లు మా ర్చడమే తప్ప కొత్తగా ఏమీ చేయ ని కూటమి

పేదల సంక్షేమాన్ని దూరం చేసిన ఈ ప్రభుత్వం, బాలింతలకు, పసిపిల్లలకు పౌష్టికాహారం కూడా అందించలేని దుస్థితిలో ఉందని బొత్స అన్నా రు. సంక్షేమ హాస్టళ్లలో కలుషితాహారం ఘట నలు నిత్యం జరుగుతున్నా, ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోందని ఆయన తేల్చి చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం పూర్తిగా శూన్య స్థాయికి చేరిందని, గిరిపుత్రులను గాలికొదిలే సిన ప్రభుత్వమిదేనని మండిపడ్డారు.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ఘనత మొత్తం వైఎస్సార్సీపీకే బొత్స సవాల్

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ఆలో చన దివంగత వైయస్సార్ హయాంలోనే పుట్టిం దని, 2014%-%19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో భూసేకరణ కూడా చేయలేదని బొత్స ఆరోపించారు. వైయస్.జగన్ ప్రభుత్వ హయాం లోనే అన్ని అనుమతులు పొందుపరచి, నిర్మా ణ పనులు ప్రారంభించామని, దీనిపై తన వ్యాఖ్యల్లో ఏ ఒక్కటి తప్పయితే తలదించుకుం టానని ఆయన ధీటుగా సవాలు విసిరారు.

రెండేళ్లలో రైతాంగం అత్యంత దారిద్ర్యానికిలోనైందని ఆగ్రహం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కొరతతో పంటలు దెబ్బతిన్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని బొత్స పేర్కొన్నారు. వైయస్సా ర్సీపీ హయాంలో గిట్టుబాటు ధర పడిపోతే ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ ద్వారా పంట కొనుగోలు చేసేదని గుర్తు చేశారు. ఈ ప్ర భుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

ఇదేంటి గుడ్ గవర్నెన్స్? లంచం లేక పనిలేదు!

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెరిగిపోగా, చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం మౌనంగా చూస్తోందని ఆయన అన్నారు. విద్య, వైద్యం, పోలీసు, రెవెన్యూ, వ్యవసాయం %-% ఏ శాఖను చూసినా పతనం తప్ప కనిపించడం లేదన్నారు.

గిరిజన సంక్షేమం పూర్తిగా పక్కన పెట్టిన ప్రభుత్వం గిరిజన బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందకపోవడం, సంక్షేమ హాస్టళ్లలో కలుషితాహారం ఘటనలు పెరగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య పూర్తిగా పక్ష వాతం పట్టినట్టైందని ఆయన వ్యాఖ్యానిం చారు.లులూ సంస్థపై కూడా బొత్స తీవ్ర విమర్శలు

లులూ సంస్థను 'పనికిమాలిన సంస్థ'గా పేర్కొ న్న బొత్స, మలేషియాలో సంస్థ బ్రాంచీలు మూ సుకుపోయాయని, విశాఖలో పెట్టుబడి ఎంత, ప్రభుత్వం ఇస్తున్న భూముల విలువ ఎంత అన్నదానిపై పారదర్శకత లేదని అన్నారు. లులూకి భూములు కేటాయింపులో ఓపెన్ యాక్షన్ విధానం ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు.కూటమి వైఫల్య పాలన పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోం ది బొత్స కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన రావడం, ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత భారీ స్థాయిలో ఉందని బొత్స వ్యాఖ్యానించారు.

సమావేశంలో పాల్గొన్న నాయకు లు ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు, శాసన మండలి సభ్యులు కుంభ రవిబా బు, మాజీ ఎంఎల్సీ సూర్యనారాయణ రాజు, పార్టీ నాయకులు ముగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అక్రమ జూదంపై చోడవరం పోలీసుల దాడి



**ఎనిమిది మంది అరెస్ట్ – నగదు, కార్డులు స్వాధీనం**

**అనకాపల్లి జిల్లా పోలీసులు అక్రమ కార్యకలాపాలపై కఠిన నిఘా**

**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 30 :** స్థానిక అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా అక్రమ కార్యకలాపాలపై నిఘాను కట్టుదిట్టం చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు చోడవరం పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారు. ఈ చర్యలలో భాగంగా చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో మరో పెద్దదాడి నిర్వహించి ఎనిమిది మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం అడ్డూరు గ్రామం, మజ్జి గౌరమ్మ దేవాలయం సమీపంలోని పిక్నిక్ స్పాట్ వద్ద అక్రమంగా జూదం జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. వెంటనే ఎస్సై బి.జోగారావు నాయకత్వంలోని బృందం అక్కడికి చేరుకొని దాడి నిర్వహించింది. దాడిలో 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.63వేల,080లు నగదు, 104 కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి విచారణ కొనసాగుతున్నట్లు చోడవరం పోలీసులు వెల్లడించారు. అక్రమ జూదం, బెట్టింగ్, మాదకద్రవ్యాల రవాణా వంటి నేరాలను నిర్మూలించేందుకు మరింత కఠినంగా చర్యలు కొనసాగుతాయని జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడైనా గమనించినప్పుడు ప్రజలు ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

# విశాఖలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు






* వ్యతిరేకంగా కోటి సంతకాల ఉద్యమం వేడెక్కింది
* ఆర్కే బీచ్ వద్ద వాలంటీర్స్ విభాగం ఆధ్వర్యంలో భారీ సంతకాల సేకరణ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 30 :**ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమం విశాఖలో ఊపందు కుంది. జిల్లా వాలంటీర్స్ విభాగం అధ్యక్షుడు పీలా ప్రేమ్ కిరణ్ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ సమీ పంలోని ఏయూ కన్వెన్షన్ వద్ద ఆదివారం భారీ గా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ మంత్రి బాలరాజు పాల్గొన్నా రు. పేదలకు వైద్యవిద్య దూరం చేసే నిర్ణయం నేత లు ఆగ్రహం సంతకాల సేకరణ కార్యక్ర. మాన్ని ఉద్దేశించి మాట్లాడిన నేతలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై పెద్ద ఆర్థిక భారం అవుతుందని ఆగ్రహించారు. వైద్య విద్య ఖరీదై సాధారణ విద్యార్థులకు అందనంత దూరం అవుతుందని, అలాగే ఉచిత వైద్యం హక్కు కోల్పోయే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు,ఈ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి సంతకాల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో పలువురు నేతలు, కార్యకర్తల పాల్గోలు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సతీష్ వర్మ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెర్ల విజయచందర్, రాష్ట్ర ఎస్సీ విభాగం అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, జోనల్ అధ్యక్షులు ఎం. సునీల్, అంబటి శైలేష్, రాష్ట్ర వాలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస రెడ్డి, విభాగం సభ్యులు మొల్లి వెంకటరమణ, వార్డ్ అధ్యక్షుడు మదుపాడ రవి, జిల్లా అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, ఉపాధ్యక్షురాలు ఇప్పిలి పార్వతి, తూర్పు ఎస్సీ విభాగం అధ్యక్షుడు బంగారు భవాని శంకర్ తదితర నేతలు పాల్గొన్నారు.అలాగే బెందాలం పద్మావతి, చొల్లంగి నాగేశ్వరరావు, ఆడారి దివ్యకళ, మీసాల ప్రదీప్, నగిరెడ్ల పోలి శెట్టి, అచ్చి సుధీర్ రెడ్డి, బాధ శ్రీను, కనకాల కృష్ణ, మౌలిక రెడ్డి, రమా, నక్కాన కమల్, గుడ్ల నర్సింగ్ రెడ్డి, సబ్బీర్, ఇతర సీనియర్ నాయకు లు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## శ్రీశ్రీశ్రీ పూర్ణ పుష్కల సమేతా అయ్యప్ప స్వామి వారి దేవాలయం 33 వ వార్షికోత్సవనికి

* భారీ అన్నాసమారాధన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి.
* ఆలయ ధర్మకర్త ,ఆలయ కమిటీ చైర్మన్ కొట్టాగుల్లి..సుబ్బారావు



**పాడేరు, పెన్ పవర్, నవంబర్ 30:** శ్రీ శ్రీ శ్రీ పూర్ణ పుష్కల సమేత అయ్యప్ప స్వామి వారి దేవాలయం నందు నేడు ఆదివారం ఆలయ పాలకవర్గ సభ్యులతో జరిగిన సమావేశం

డిసెంబర్ 2-12-2025 తారీకు మంగళవారం నాడు ఆలయ 33 వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాట్లపై సమీక్ష ధర్మకర్త కొట్టగుల్లి .సుబ్బారావు నిర్వహించారు.

ఈ సంవత్సరం జరిగే ఆలయ 33 వ వార్షికోత్సవాలలో పాడేరు పుర ప్రజలు,భక్తులు, ఉద్యోగస్తులు,వ్యాపారస్తులు, అందరూ హాజరయ్యేలాగా భక్తులకు ఎటువంటి ఆసాకర్యం లేకుండా చూడాలని ఆలయ కమిటీ చైర్మన్ కొట్టగుల్లి. సుబ్బారావు ఆదేశించారు. ఆరోజు జరిగే భారీ అన్నసంతర్పణ కార్యక్రమానికి సుమారు 5000 మంది హాజరు కావచ్చు అని కమిటీ సభ్యులు అంచనా వేశారు. కావున భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేస్తామని కమిటీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ రొబ్బి .రాము, ఇమ్మడిశెట్టి .అనిల్, కోశాధికారి ఆదిత్య, దాము ప్రచార కార్యదర్శులు హెూటల్ సత్తిబాబు, కొణతాల ప్రశాంత్, మెకానిక్ సత్తిబాబు, అయ్యప్ప శ్రీనివాస్, జ్యోతి మందిర్ ప్రకాష్ అన్నదాన కమిటీ సీతారాం, అశోక్ ,కమిటీ, ప్రధాన అర్చకులు ప్రవీణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకమహాలక్ష్మీ దేవస్థానంలో భక్తుల కోసం ఆన్‌లైన్ సేవలు ప్రారంభం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 30 :**భక్తుల సౌకర్యార్థం శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం సేవలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో అందుబాటులోకి తెచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు మరియు దేవదాయ శాఖ కమిషనర్ సూచనల మేరకు దర్శనాలు, అభిషేకాలు, ప్రత్యేక సేవలు, ప్రసాదం టోకెన్ల బుకింగులు ఇకపై ఆన్‌లైన్‌లో పొందుపరచబడ్డాయి.దేవస్థానం సందర్శించాల నుకునే భక్తులు %ఎఎఎ.ఖజూవఎజూశ్రీవం .ఖజూ.స్త్రశీజ.అఅ% వెబ్‌సైట్ ద్వారా లేదా "మన మిత్ర" వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా టిక్కెట్లు సులభంగా బుక్ చేసుకోవచ్చు.అలాగే సేవల రుసుములు, అన్నదానం, శాశ్వత పూజలు, విరాళాల చెల్లింపులు క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, గూగుల్ పే, ఫోన్ పే, భారత్ పే (యు పి ఐ) ద్వారా చెల్లించుకునే వీలును కల్పించారు. భక్తుల సౌలభ్యం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేవస్థానంలో %ూూూ% మెషీన్లను కూడా ఏర్పాటు చేశారు.

దేవస్థానం అధికారులు భక్తులు ఈ డిజిటల్ సౌకర్యాలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు.

## ఉత్తరాంధ్ర కళాకారుల చే నిర్మించిన చిత్రం

ఎవడి సినిమాకి వాడే హీరో'




**విశాఖ పెన్ పవర్ నవంబర్ 30:**ఎవడి సినిమాకి వాడే హీరో టైటిల్ తో విశాఖలో ఉత్తరాంధ్ర కళాకారుల చే నిర్మించిన చిత్రం విడుదలకు సిద్ధమయింది. డిసెంబర్ 13వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వివిధ థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు చిత్ర నిర్మాణ ప్రముఖులు విలేకరుల సమావేశంలో తెలిపారు. పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ పిఏ భాస్కరరావు, ప్రొడ్యూసర్ దుగ్గివలస దివాకర్, సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి చిత్ర బృందంతో కలిసి ఆదివారం ఉదయం విజయ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విశాఖ వాసులకు దశాబ్దాలుగా పరిచయం ఉన్న పిఏ భాస్కరరావు సారథ్యంలో ఈ చిత్ర నిర్మాణం చేసుకోవడం స్థానిక కళాకారులకు ఇందులో అవకాశం కల్పించడం అభినందనీయం అన్నారు. చిత్రం తప్పకుండా విజయవంతం అవుతుందని, కళాకారులంతా అద్భుతంగా నటించారని చిన్న సినిమాలను ఆదరించాలని ఫిలిం డైరెక్టర్ దుగ్గివలస దివాకర్ పేర్కొన్నారు. కళలకు పుట్టినిల్లు విశాఖ అని గతంలో విశాఖలో నిర్మించిన అనేక చిత్రాలు జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డులు సొంతం చేసుకున్నాయని ఈ చిత్రం కూడా తప్పకుండా విజయవంతం అవుతుందని సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి పేర్కొన్నారు. సమావేశంలో నటీనటులు మల్లికా జానీ మాస్టర్ బుజ్జి వీరేష్, రచయితలు సనార వంశి ,సత్యవాద శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా మురళి వ్యవహరించారు.

## కాకి గంగరాజు ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెలగపూడి





**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 30:** జీవీఎంసీ 11వ వార్డు గాం%ఎ%ధీ నగర్ లో టీడీపీ నాయకులు వి జ్యువలరీ మార్ట్ అధినేత కాకి గంగరాజు (క్యాటరింగ్ రాజు)ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.కార్యక్రమాన్ని తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన గంగరాజును ఆయన అభినందించి పేదలకు ఉచిత వైద్యం అందించడం హర్షించదగ్గ విషయమని, పేదలకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు దాతలు నిర్వాహకులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలోవైద్య సుమారు 200 11వ వార్డు,సమీప ప్రాంతాల ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె శ్యామ్.డాక్టర్ నవీన్ డాక్టర్ భరత్ డాక్టర్ వైద్య బృందం వైద్య సేవలు ప్రధానంగా బీపీ,షుగర్, జనరల్ చెకప్ చేశారు.వైద్య సేవలు అవసరమైన వారికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని కాకి గంగరాజు తెలియజేశారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఓమ్మి సన్యాసి రావు. 11 వార్డ్ అధ్యక్షులు ముగడ రాజారావు.వార్డ్ ఇంచార్జ్ శ్రీ అచ్యుత్ రావు.జనసేన పార్టీ అధ్యక్షులు సారిపల్లి రాము, రామడుగు విక్రమ్.సీనియర్ నాయకులు మూది అప్పారావు,కృష్ణంరాజు. సింహాద్రి శేఖర్,రంగాల మంగరాజు.రేఖ.జయమ్మ. జ్యోతిర్మయి.లలిత రాజేశ్వరి. గాంధీనగర్ గ్రామ అంబేద్కర్ యువజన సేవా సంఘం సభ్యులు.కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

## ఆరోగ్యం, పరిశుభ్రతపై శిక్షణ




అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 30:-**ఆరోగ్యం పరిశుభ్రతపై విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు, సూపర్వైజర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా అందించడం జరిగిందని విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భార్గవి అన్నారు. శుక్ర శనివారం లో స్థానిక ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రుతుక్రమం గురించి బహిరంగంగా మాట్లాడే ధైర్యాన్ని విశ్వాసాన్ని మహిళలు పెంపొందించుకోవాలన్నారు. సృష్టిలో భాగమైన స్త్రీల రుతుక్రమ సమస్యపై నేటి సమాజ పరిస్థితులలో తప్పనిసరి అన్నారు. రుతుక్రమ సమయంలో స్త్రీలు నిర్భయంగా మాట్లాడవచ్చును అన్నారు. ఫ్రంట్ లైన్ కార్మికుల కోసం ఇలాంటి సామర్థ్య వృద్ధి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. రుతుక్రమ సమయంలో మహిళలు తప్పనిసరిగా పరిశుభ్రత మరియు ఆరోగ్యం పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి పి వి వి ప్రసాద్, అంగన్వాడి సూపర్వైజర్స్ తో పాటు సుమారు 200 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ డాక్టర్ కందులనాగరాజు పుట్టినరోజు వేడుకలు





**పదివేల మందికి చీరలు దుప్పట్లు పంపిణీ**

**విందు భోజనాలు.. పసందైన కానుకలు**

**అల్లిపురం పెన్ పవర్ నవంబర్ 30:**ప్రముఖ సంఘ సేవకులు ..జనసేన పార్టీ నాయకులు.. 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు దాతృత్వానికి మారుపేరుగా నిలిచారని జనసేన పార్టీ నాయకులు విశాఖ దక్షిణ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ కొనియాడారు.. ఆదివారం కందుల నాగరాజు పుట్టినరోజు వేడుకలు

నేరెళ్ల కోనేరు జంక్షన్ లో ఉన్న ఆయన నివాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పుట్టినరోజు వేడుకల్లో శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ నగర మేయర్ పీలా శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ

నిరుపేదలకు నిరంతరం సేవ చేయాలనే మంచి సంకల్పంతో కందుల అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.. పేదలకు అండగా నిలవడంతో పాటు తన పరిధి మేరకు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మందికి ఆదర్శప్రాయాలుగా నిలుస్తున్నారన్నారు.. నిరుపేదలకు నిత్యవసరాలు.. తోపుడు బండ్లు.. నవవధువులకు నూతన వస్త్రాలు

మంగళ సూత్రాలు.. అలాగే వివిధ రకాల శుభకార్యాలకు పట్టుచీరలు దేవాలయాలకు వివిధ రకాల వెండి.. బంగారు వస్తువులు ఇలా లెక్కలేనన్ని సహాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత కందుల నాగరాజు కే దక్కుతుందన్నారు. సేవలకు చిరునామాగా నిలిచిన డాక్టర్ కందుల .భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజులు

జరుపుకోవాలని వీరు ఆకాంక్షించారు..32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ

తన పరిధి మేరకు విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు..

కులాలకు..

మతాలకు అతీతంగా దక్షిణ నియోజకవర్గం పరిధిలో సాయం కోరేవారందరికీ ఏదో ఒకటి చేయాలనే మంచి సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా తన ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు.. అలాగే తనపై నమ్మకం ఉంచి కార్పొరేటర్ గా గెలిపించిన ప్రజల ఆకాంక్షల మేరకు తన వార్డు ను పూర్తిస్థాయిలో రోల్ మోడల్ గా అభివృద్ధి చేస్తున్నట్లు నాగరాజు చెప్పారు.. ఇంకా మరికొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలని

వాటిని కూడా పూర్తి చేసేందుకు సహకరించాలని అతిధులను కోరారు.

కందుల నాగరాజు పుట్టినరోజు వేడుకలు సందర్భంగా ఈ ఏడాది అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.. ప్రధానంగా 10000 మంది నిరుపేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే తోపుడు బండ్లు అందజేశారు. అందరికీ విందు భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక కానుకలు అందజేశారు.. అలాగే పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.. ఈ పుట్టినరోజు వేడుకలకు సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ..జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి

డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షత వహించగా కెఎన్ఆర్ ట్రస్ట్ డైరెక్టర్లు కందుల బద్రీనాథ్ కేదార్నాథ్ పలువురు కార్పొరేటర్లు.. మాజీ కార్పొరేటర్లు.వార్డ్ అధ్యక్షులు.. పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు.. అనేకమంది స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు పాల్గొని కందుల నాగరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు అలాగే కందుల దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు..



# జగ్గంపేటలో "డ్రగ్స్ వద్దు బ్రో- సైకిల్ తొక్కు బ్రో" ర్యాలీ



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 30:** జగ్గంపేటలో ఆదివారం పోలీసులు "డ్రగ్స్ వద్దు బ్రో– సైకిల్ తొక్కు బ్రో" అనే నినాదంతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్, ఎస్సై టి.రఘునాథరావు తమ సిబ్బందితో కలిసి సైకిళ్ల పై జగ్గంపేట పురవీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. తమ ప్రాంతాల్లో ఉన్నటువంటి చాలామంది యువత ఎటువంటి గంజాయి వినియోగించకుండా చూసుకునే బాధ్యత తమపై ఉందన్నారు. అదేవిధంగా గంజాయి పండించడం, అమ్మడం, కొనడం మరియు రవాణా చేయడం వలన చట్టరీత్యా కఠినమైన శిక్షలు పడతాయన్నారు. మత్తు పదార్థాల వాడకంతో కలిగే శారీరక, మానసిక సమస్యలను వివరించారు. స్కూల్స్ మరియు కాలేజీల పరిసర ప్రాంతాలలో ఏదైనా డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు సంబంధిత సమాచారం ఉంటే ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 నెంబర్ కు తెలియచేయాలని, సమాచారం తెలిపిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం డ్రగ్స్ కలిగి ఉన్నా, విక్రయించినా లేదా వాడినా కఠినమైన శిక్షలు విధించబడతాయని 10 నుండి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు లక్షల రూపాయల జరిమానా పడే అవకాశం ఉందని వివరించారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్రతిజ్ఞ చేశారు.

# ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు - భారత్ టాలెంట్స్ అవార్డ్స్ ప్రధానం





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 30:**ర్యాలి గ్రామంలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్, శ్యామ్ జాదూగర్ మాయా ఈ బడి ఆధ్వర్యంలో పదవ జాతీయస్థాయి భారత్ టాలెంట్ చిల్డ్రన్స్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఎంపికైన 18 మంది చిన్నారులు వివిధ కళారూపాల్లో తమ ప్రతిభను ప్రదర్శించి బాల విభూషణ్, బాల భూషణ్, బాలశ్రీ అవార్డులు అందుకున్నారు.

ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం. దివ్య రెడ్డి, సౌభాగ్య గ్రూప్ అధినేత చిన్నం చంద్రారెడ్డి దంపతులు చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ "చిన్నారులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లేందుకు కళ, కలలు దోహదం చేస్తాయి. పిల్లలకు ఇష్టమైన కళలో శిక్షణ ఇవ్వాలని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి" అని సూచించారు.కార్యక్రమంలో శ్యామ్ జాదుగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు శ్యామ్ అన్నపూర్ణ, డాక్టర్ మోహిత్ సీత, తేజశ్రీ పాల్గొన్నారు.

# నలుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 30**: మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి జూదరులను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. జూద క్రీడలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వైఎస్ఆర్సిపి అనుబంధ సంఘాల వార్డు అధ్యక్షుల సమావేశం.



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 30:** జీవీఎంసీ 19 వవార్డు అధ్యక్షులు పతివాడ కనకరాజు ప్రధాన కార్యదర్శి కంట్రెడ్డి కన్నబాబు ఆధ్వర్యంలో వార్డు అనుబంధ సంఘాల అధ్యక్షుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మన తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని అనుబంధాల సంఘాల అధ్యక్షులను ఉద్దేశించి మాట్లాడారు.పార్టీకి అనుబంధ సంఘాలే పట్టుకొమ్మలు అని అనుబంధ సంఘాల అధ్యక్షులు ప్రతి ఒక్కరూ వారి వారి కమిటీలో 8 మంది సభ్యులతో కూడిన పార్టీకి నిస్వార్థంగా నిలబడే వ్యక్తులను నియమించుకోవాలని, వార్డులో పార్టీకి బలంగా అనుబంధ సంఘాలు ఉండాలని ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షులు వైదా నారాయణరావు అనుబంధ సంఘాల అధ్యక్షుల ప్రాముఖ్యతనుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు కె అర్ పాత్రుడు,మాజీ ఏపీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి ,జిల్లా పార్టీ కార్యదర్శి బోండా శ్రీను,తూర్పు నియోజకవర్గ వాలంటీర్ విభాగం అధ్యక్షులు మొల్లి వెంటరమణ,జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి కనకల కృష్ణ, వార్డు ప్రధాన కార్యదర్శి కంట్రెడ్డి కన్నబాబు,

వార్డు వైస్ ప్రెసిడెంట్ కిలపర్తి గోవిందు, వార్డు కార్యదర్శి కనకల గురునాయుడు వీరమ్మ, అలాగే వార్డు యువజన విభాగం అధ్యక్షులు కంటుబోతు తులసీరామ్ మరియు వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సీనియర్ నాయకులుకార్యకర్తలు ,మహిళా కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

# కొత్తపేటలో దోమల నిర్మూలనే లక్ష్యం- ఆరోగ్య విభాగం కసరత్తు





**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు30:**కొత్తపేట మండల అభివృద్ధి అధికారివారి కార్యాలయంలో శనివారం జరిగిన హెల్త్ అసిస్టెంట్స్ వీక్లీ రివ్యూ మీటింగ్‌లో జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల వారీగా జ్వరాలపై నిరంతర సర్వే నిర్వహించి, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా దోమల ఉత్పత్తిని అరికట్టే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు.

డ్రైనేజీలు, నీటికుంటలు, నిల్వ నీటి ప్రాంతాల్లో దోమల గుడ్లు,లార్వా నిర్మూలన కోసం క్రిమిసంహారక మందుల స్ప్రేయింగ్‌ను క్రమం తప్పకుండా చేపట్టాలని, రక్షిత మంచినీటి క్లోరినేషన్ వాటర్‌ట్యాంకుల శుభ్రతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆయన తెలిపారు. రికార్డులను పరిశీలించి తగు మార్గనిర్దేశం చేస్తూ డెంగ్యూ కేసులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. దోమకాటు ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధుల ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరాన్ని కూడా నక్కా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి ఎస్. రాజబాబు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# విఫలమైన మావోయిస్టుల బంద్



**వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 30 :** ఆదివారం ఏజెన్సీ బంద్ కు మావోయిస్టు పిలుపునివ్వగా విఫలమైందని పలువురు అంటున్నారు.

ఎన్ కౌంటర్ లకు నిరసనగా మావోయిస్టులు బంద్ కు పిలుపునివ్వగా విఫ్లమైందనే అంటున్నారు. ముందస్తు చర్యలలో భాగంగా ఏలేశ్వరం డిపో నుండి వైరామవరం వచ్చే బస్సు సర్వీసులను రద్దు చేశారు. యధావిధిగా ప్రైవేట్ సర్వీస్ లు తిరిగాయి. యధావిధిగా దుకాణాలు తెరుచుకున్నాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# హిందూ సమ్మేళనం విజయవంతం చేద్దాం




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 30.**తాడేపల్లిగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వం విప్ శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ గారి ఆదేశాల మేరకు సోమవారం జరగబోయే హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ, పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ గారి ఆధ్వర్యంలో 23వ వార్డు లో ప్రచారం చేపట్టారు.

కృష్ణుడు గుడి ప్రాంగణంలో భక్తులకు ఫామ్ ప్లేట్లు పంపిణీ చేస్తూ, రేపు మధ్యాహ్నం 3 గంటల నుండి ఎన్ కె గ్రౌండ్లో జరిగే ఈ మహాసమ్మేళనంలో ఎన్ డి ఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్త జనులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని ఘనవిజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. పాల్గొన్న వారు 23వ వార్డు ప్రెసిడెంట్ కాకర్ల శివ, కోడిత్రాసు వెంకటేష్, బండి దుర్గా ప్రసాద్, సుధీర్, కృష్ణుడు గుడి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విగ్నేశ్వర బియ్యం కట్టి శ్రీ బలుసులమ్మ అమ్మవారి జాతరకు శ్రీకారం

## నేటి నుండి బలుసులమ్మ జాతర పనులు ప్రారంభం





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 30.**తాడేపల్లిగూడెం గ్రామదేవత శ్రీ శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం లో, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వం విప్ శ్రీ బోలిశెట్టి శ్రీనివాస్ గారి ఆదేశాల మేరకు ఆలయ చైర్మన్ శ్రీరంగం రామాంజనేయులు (అంజి) ఆధ్వర్యంలో జాతర మహోత్సవ పనులకు భవ్యంగా శ్రీకారం చుట్టారు.

ఆదివారం ఉదయం 8:56 గంటలకు అమ్మవారి సన్నిధిలో విగ్నేశ్వర మీది కట్టి, గణపతి పూజ, అభిషేకాలు మొదలైన శాస్త్రీయ కార్యక్రమాలను బ్రహ్మశ్రీ ఫణి శర్మ మరియు ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ, గోపీనాథ్ శర్మ, మల్లికార్జున రావు నూతనోత్సాహంతో నిర్వహించారు.

ఈ పూజా కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ శ్రీరంగం రామాంజనేయులుల తల్లిదండ్రులు శ్రీరంగం సత్యనారాయణ, శ్రీమతి సావిత్రి చేతుల మీదుగా పూర్తి చేసి, 12.03.2026 నుండి 27.03.2026 వరకు జరిగే శ్రీ బలుసులమ్మ అమ్మవారి జాతర మహోత్సవ కార్యక్రమానికి అంకురార్పణ చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న వారు

ఆలయ కార్య నిర్వహణ అధికారి బీవీ చంద్రశేఖర్, ఆలయ సభ్యులు నీలం సురేష్, దాట్ల జగన్నాథ రాజు, జయప్రకాశ్, పట్నాల రాంపండు, సిహెచ్ కిరణ్, చవ్వాకుల వెంకటరమణ, మల్లీడి రాంబాబు, రుద్ర విజయ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జాతర నిమిత్తం విరాళాలు

జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వ్యాపారవేత్తలు అప్పన వెంకట సత్య రమేష్ కుమార్ దంపతులు (1,01,116 విరాళం ప్రకటించారు.

బలుసులమ్మ తల్లి లలితా పారాయణ సభ్యులు 1,01,116,

పాతూరు యూత్ సభ్యులు %ద% ఆలయ సభ్యులు సుంకర ధన బాబు 1,01,116 విరాళం ప్రకటించి అందరి అభినందనలు పొందారు.

# మోడేకుర్రు - పుల్లెట్టుకుర్రు రహదారి అభివృద్ధికి రూ.1.50 కోట్లు మంజూరు





**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు30:**మోడేకుర్రు మెయిన్ రోడ్ నుండి సంజీవ్ నగర్ మీదుగా పుల్లెట్టుకుర్రు గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో నూతన రహదారి నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు కావడం స్థానికులకు శుభవార్తగా మారింది. కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావు నిరంతర ప్రయత్నాల ఫలితంగా ఈ నిధులు శాంక్షన్ చేయబడినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.ఈ రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత మోడేకుర్రు - పుల్లెట్టుకుర్రు మధ్య ప్రయాణ సౌకర్యం మెరుగుపడటమే కాకుండా, గ్రామాల మధ్య రవాణా వ్యవస్థ కూడా సులువుగా మారనున్నది. ప్రత్యేకించి విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
ఇదే రహదారి మార్గంలో శిధిలావస్థలో ఉన్న పంటకాలువ తూరలు రైతులకు పెద్ద సమస్యగా మారగా, ఈ విషయం పై గ్రామ సర్పంచ్ కూడుపూడి రామలక్ష్మి (వెంకటేశ్వర్లు) తక్షణం స్పందించారు. సంబంధిత అధికారులతో కాంట్రాక్టర్‌తో సమావేశమై పంటకాలువల పాత, దెబ్బతిన్న తూరలను తొలగించి, అధికారుల అనుమతితో పూర్తిగా కొత్త నూతన తూరలను ఏర్పాటు చేయించే చర్యలు చేపట్టారు.
పంటకాలువ తూరల మార్పిడి పనులు పూర్తికావడంతో పంటలకు నీటివసతి మరింత సాఫీగా అందే పరిస్థితి ఏర్పడుతుందని, భవిష్యత్తులో వ్యవసాయానికి ఇది ఎంతో ఉపయుక్తం కానున్నదని రైతులు తెలియజేశారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు, సర్పంచ్ చూపుతున్న దృష్టిని ప్రశంసిస్తూ, స్థానిక ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# లింగంపేట వాంబే గృహాల కాలనీ లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పర్యటన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్,30:** స్థానిక 39వ డివిజన్ లింగంపేట వాంబే గృహాల వద్ద సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదివారం పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలతో వాంబే గృహాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం మేరకు ఆయన డివిజన్ ఇన్‌ఛార్జ్ యాళ్ల ప్రదీప్, టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పర్యటించారు. నీటి అవసరాలకు ఇబ్బందులుపడుతున్న కారణంగా వెంటనే అంచనాలు తయారు చేసి నూతనంగా మోటారు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వాంబే గృహాల్లోని బ్లాకుల్లో సెప్టిక్ ట్యాంకుల, డ్రైనేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆదేశించారు. లింగంపేట 1వ వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు త్వరి తగతిన పూర్తి చేయాలన్నారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డు లు సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా కూటమి ప్రభుత్వ పరిష్కారీస్తాన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంట ఉన్నారు.

# కొత్తపల్లిప్రాతంలోగృహాలకుస్థలాలు ఇవ్వండి

-ఐ.టి.డి.ఏ.పి.ఓ.సంబంధిత అధికారులకు తీర్మానం అందజేత
-ఐ.టి.డి.ఏ.పి.ఓ.కుకృతజ్ఞతలుతెలిపిన వడ్డిగూడెం గ్రామస్థులు



**వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్.30:**పోలవరం ప్రాజెక్టుకారణంగా సర్వంకోల్పోతున్న వడ్డిగూడెం గ్రామస్థులనిర్వాసితుల గ్రామాలను సురక్షితమైన ప్రదేశాలకుతరలించడంలోభాగంగా యాదవోలు,కొత్తపల్లి ప్రదేశాలకుప్రజలనుసందర్శ నకుపంపించి,గృహాలునిర్మాణంకొరకు భూమిను సంబంధిత అధికారులుద్వారా చూపించడం జరి గింది.యాదవోలు ప్రాంతంలోత్రాగునీరుఅనుకూ లంగాలేనికారణంగా ఆప్రాంతాన్ని తిరస్కరించుతూ కొత్తపల్లి ప్రాంతంలో సుమారు వందఎకరాలభూమి లోత్రాగునీరుఅరవైఅడుగులు నుండిఎనబైఅడుగుల లోతుభూగర్భజలాలో మంచిత్రాగు నీరుపడుతుంది. కొత్తపల్లి,నుండి రాజమహేంద్రవరంకు ముపైకిలోమీటర్లు దూరంఉంటుంది.గోకవరానికి ఐదు కిలోమీటర్లు దూరం ఉండడం ప్రజలందరికీ అనుకూలం గాఉంటుందని, సుమారుఎనబైశాంతంప్రజలు సంతకాల సేకరణ ద్వారాఆమోదం తెలుపుతూ ప్రభుత్వఅధికారులకు వి.ఆర్.ఓ ద్వారాతీర్మానంచేసిఆదివారం చింతూరు ఐ.టి.డి.ఏ.పి.ఓ.ఆదేశాలమేరకు సంబంధితఅధికారు లకుతీర్మానాన్ని అందజేయడంజరిగింది.అదేవిధంగా ఈరోజువీడియో కాన్ఫరెన్స్,ద్వారా గ్రామ నిర్వాసితులతో ఐ.టి.డి.ఏ.పిఓ,మాట్లాడారు.కొత్త ప్రాంతంలోదేవాలయా లు,పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలు,గ్రామ ప్రజలకు అన్నిసదుపాయాల తోపాటు స్మశానవాటికలు కూడా నిర్మించుతామని, తెలిపారు.వడ్డిగూడెం గ్రామప్రజలు ఐ.టి.డి.ఏ.పిఓకు కృతజ్ఞతలుతెలిపారు.



**పెన్ పవర్ నవంబర్ 30:** ఈ రోజు నల్లజర్ల మండలం ముసళ్ళగుంట గ్రామం లో కోట చినసుబ్బారావు గారు నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు
వారి కుటుంబానికి జనసేన పార్టీ తరఫున గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ దొడ్డిగర్ల సువర్ణరాజుగారు సారధ్యంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీ అచ్యుత సత్యనారాయణ గారు, నల్లజర్ల జనసేన పార్టీ మండల అధ్యక్షులు శ్రీ చోడసాని బాపిరాజు గారు, ముసళ్ళగుంట జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దగాని శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో మూడు రైస్ ప్యాకెట్స్, అయిల్ పేకిట్స్,కూరగాయలు, కందిపప్పు, పంచదార అందించడం జరిగింది.
తరువాత జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ సువర్ణరాజు గారు మాట్లాడుతూ జనసేన పార్టీ మీకు ఎప్పుడు తోడుగా ఉంటాదని,మీకు ఏకష్టం వచ్చినా మీకు అందుబాటు లో ఉంటామని భవిష్యత్తులో మీ ఇద్దరి అబ్బాయిల చదువు విషయం లో మా కళాశాల ద్వారా తప్పనిసరిగా సహాయం చేస్తామని అభయం ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో నల్లజర్ల జనసేన పార్టీ మండల కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు గారు, చీపురుగూడెం జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు గుండాబత్తుల వరుణ్ కుమార్ గారు, సింగరాజుపాలెం జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు
దొండపాటి బాబు గారు, ప్రకాశరావుపాలెం జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు
రాచమల్ల నాగరాజు గారు, తలంశెట్టి శ్రీనివాస్ గారు,
మొగల శివ గారు, నిట్టా జనార్ధన్ గారు, దగాని రాంబాబు గారు, నాయుడు మహేష్ గారు, జాను గారు జాన్ గారు,అశోక్ గారు, వంశీకృష్ణ గారు, అనిరుద్ గారు, అభిరామ్ గారు, జనసేన నాయకులు, జన సైనికులు, పాల్గొన్నారు


# వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించిన స్నేహితులు



**అంబాజీపేట పెన్ పవర్ నవంబర్ 30:** పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థు లు తమ స్నేహాన్ని చాటుకున్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో 2002-03 10వ తరగతి విద్యార్థులు అందరూ చిన్ననాటి జ్ఞాపకాలను మరిచిపోకుండా ఎప్పటికప్పుడు అందరితో మేకమవుతున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో పోతవరం గ్రామానికి చెందిన మాత రాంబాబు కాలికి గాయం అయ్యింది. దీంతో పదవ తరగతి పూర్వ విద్యార్థులందరూ కలిసి స్నేహితు డు రాంబాబుకు వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 30 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అతని ఇంటి వద్ద అందజేశారు. దీంతో రాంబాబు స్నేహితులు చేసిన సహాయం మరువలేనిదని ఎప్పుడూ మనమందరం ఇలాగే కలిసి ఉందాం అని అన్నారు. ఇదేవిధంగా గతంలో అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడు కు ఆర్థిక సాయంఅందచేసారు. రాంబాబు కుటుంబ సభ్యులు గ్రామస్తులు రాంబాబు మిత్రబృందాన్ని అభినందించారు

# సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 30**:తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు, ఆదివారం రాజమహేంద్రవరం పరిధి లోని వివిధ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, సత్ప్రవర్తన, కెరీర్ గైడెన్స్ వంటి కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలో సంక్షేమ వసతి గృహాలలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాలోని విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా తీసుకుని, ప్రసిద్ధ వైద్యులు, నిపుణులను ఆహ్వానించి, వారి అనుభవాలను, మార్గదర్శక సూత్రాలను విద్యార్థులతో పంచు కున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడం, సంస్కార వంతమైన ప్రవర్తనను అలవర్చడం, భవిష్యత్తు లక్ష్యాలపట్ల స్పష్టత కల్పించడం, ఉన్నత విద్య - ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచడమని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కిమ్స్ ఆసుపత్రి ప్రతినిధి డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం వై-జంక్షన్ హాస్టల్స్ సముదాయాన్ని సందర్శించి, విద్యార్థులతో ముఖాముఖిగా చర్చిస్తూ మార్గనిర్దేశం అందించారు.
ఈ కార్యక్రమంలో ఏబిసి డబ్ల్యూవో ముత్యాల సుబ్బారావు, హెచ్‌డబ్ల్యూవో లు అబ్దుల్ సుకూర్, వై. శ్రీనివాస్, కె. సుందరమ్మ, వైద్యులు, అధ్యాపకులు, వసతి గృహాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం.



**-తుమ్మలపల్లి రమేష్.**

**కిర్లంపూడి, పెన్ పవర్,నవంబర్ 30:** ఏసుక్రీస్తు బోధనలో ఎంతో ఆచరణీయమని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి యేసు రక్షణ మందిరం పాస్టర్ విజయ్ కుమార్, పలువురు సంఘస్తులు ఆధ్వర్యంలో తుమ్మలపల్లి రమేష్ ను ఆదివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ డిసెంబర్ నెల అంతా క్రైస్తవులకు ఎంతో పవిత్ర మాసం అన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతోపాటు జనసేన పార్టీ నాయకులు దాడి చినబుజ్జిని పాస్టర్ విజయకుమార్ పలువురు సంఘస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఎల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, చిక్కాల కల్కిభగవాన్, నాగబోయిన శివ,బొండా నందిబాబు,బొండా రమణ,లంక సత్యనారాయణ, నూకల సాయికుమార్,లతోపాటు సలగాల చక్రధర, జెడ్డా నాని బోదుపు శ్రీను సలగాల సతీష్, అత్తమూరు నూకరాజు,ఆకుముత్తు చందు పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

# రాజానగరంలో అక్రమ గ్రావెల్ మట్టి..



**కూటమి నాయకుల దందా ..**

**కోరుకొండ, పెన్ పవర్, నవంబర్ 30:** రాజానగరం నియోజకవర్గంలో అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ ఎక్కడైనా మట్టి గ్రావెల్ పర్మిషన్ లేకుండా తవ్వకాలు జరిపితే సమాచారం ఇవ్వాలని మీడియా పూర్వకంగా తెలియజేసిన అక్రమంగా కొంతమంది కూటమి నాయకులు ఈ దందా కొనసాగిస్తున్నారు. కొంతమంది రాత్రి పగలు తేడా లేకుండా ఎమ్మెల్యే పేరు చెప్పి దందా కొనసాగించడం మరీ ముఖ్యంగా మాకు అన్ని పరిమిషన్స్ ఉన్నాయని చెప్పుకుంటూ ఇదంతా కొనసాగిస్తున్నారు. దీనిపై రెవెన్యూ మైండ్స్ అధికారులు దృష్టిపెట్టి పకృతిని కాపాడాలని ప్రజల అభిప్రాయపడుతున్నారు.

# పెంచలయ్యపైజరిగినహత్యను ఖండిస్తూనిరసన - సి.పి.ఎం.మండలకమిటీనాయకులు

**వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్. 30:**మండలంలోని రేఖపల్లి,సిపిఎం,స్థూపంవద్దఆదివారం సి.పి.ఎం.మండల కమిటీఆధ్వర్యంలో నెల్లూరులో ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్యపై జరిగినహత్యను ఖండిస్తూ గంటపాటునిరసన కార్యక్రమంచేపట్టారు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయంచిన్నబాబు,మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,మాట్లాడుతూఈనెల 28వ.తేదీన నెల్లూరు పట్నంలోప్రజాకళాకారుడు,నెల్లూరు రూరల్ కార్యదర్శి కె.పెంచలయ్యను,గంజాయిదుండగులు అతిదారుణం గాకత్తులతో దాడి చేసి చంపిన ఘటనను ప్రజానాట్య మండలి,వి.ఆర్.పురంమండలకమిటీ తీవ్రంగా ఖండి స్తోందని,కళారూపాలతోప్రజలను.చైతన్యంచేస్తూసంఘ విద్రోహశక్తులకు ఎదురునిలబడి పోరాడిప్రాణాలర్పించి నపెంచలయ్య మృతి,ప్రజానాట్య మండలికి తీరని లోటని,హత్యలు చేస్తున్న సంఘ విద్రోహశక్తులను కట్టడిచేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతు న్నాయని,ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని పెంచల య్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు,మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,మండల కమిటీ సభ్యులు పంకుసత్తిబాబు, మండపంకుసత్తిబాబు,పూనెంప్రదీప్ కుమార్,సిరపు తాతబాబు,గొంది దారయ్య,సిపిఎం రేఖపల్లి శాఖ సెక్రెటరీ వేటగాని సూరిబాబు,ప్రజానాట్యమండలి జిల్లాసభ్యులు సి.హెచ్.సుబ్బారావు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# బీసీ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు పరిచయం






**కాకినాడ, పెన్ పవర్,నవంబర్ 30:**బీసీ ఉద్యోగుల సంక్షేమం, సంఘ బలోపేతం లక్ష్యంగా కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు కి ఆదివారం పరిచయం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జోగా రామకృష్ణ, కాకినాడ నగర అధ్యక్షులు కదలి నాగరాజులను ఎమ్మెల్యే కొండబాబు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు బీసీ ఉద్యోగుల సంక్షేమానికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ తమకు అండగా ఉంటానని తెలిపారు.రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి బీసీ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేశామని తెలిపారు. డిసెంబర్ 20న జరగబోయే బీసీ ఉద్యోగుల మహాసభలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు అద్దంకి వెంకన్నబాబు, గంటి రాధాకృష్ణ, వాసంశెట్టి చక్రపాణి, కాకినాడ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ సంగాడి రాజసింహ వర్మ, రాపర్తి శ్రీనివాస్, డి. ఏడు కొండలు, చిట్టిబాబు, ఈగల శ్రీను, వనుము శ్రీనివాస్, మల్లాడి గంగాధర్ వర్మ, వాసంశెట్టి కృష్ణమూర్తి, నరసింహమూర్తి, ములంపాక శ్రీనివాసరావు, కోలాటి అచ్యుత రామరాజు, సీరం సత్యనారాయణ, నాగిడి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో బిజెపి అనుబంధ విభాగాలకు జిల్లా అధ్యక్షులు నియామకం

బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 30:**భారతీయ జనతా పార్టీ అనుబంధ విభాగాలైన మహిళా మోర్చా, కిసాన్ మోర్చా, బి సి మోర్చా, ఎస్ సి మోర్చా, మైనారిటీ మోర్చాల జిల్లా అధ్యక్షుల నియామకం చేసామని బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర తెలిపారు. భారతీయ జనతా పార్టీ ని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసి ఎక్కువ మంది పార్టీ కార్యకర్తలను ప్రజా ప్రతినిధులుగా తయారు చేయడమే లక్ష్యంగా జిల్లాలోని అన్ని మండలాలలో పార్టీ క్యాడర్ తో కలిసి పర్యటిస్తున్నామన్నారు. గ్రామాలలో ప్రజాదరణ, జాతీయ భావజాలాన్ని కలిగిన వ్యక్తులను పార్టీలోకి ఆహ్వానిస్తు న్నామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తల గెలుపే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ముందుగా 5 మోర్చాలకు సంబంధించి జిల్లా అధ్యక్షులను నియమించామన్నారు. మిగిలిన రెండు మోర్చాల అధ్యక్షులను త్వరలో నియమిస్తానన్నారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు గా పాలడుగుల శ్రీవిద్య, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గా పేపకాయల కాశీ, బిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గా మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్, ఎస్ సి మోర్చా జిల్లా అధ్యక్షులు గా తగరం సురేష్ బాబు, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు గా రాజేష్ కుమార్ జైన్ లను నియమించమన్నారు. పార్టీ మోర్చాలకు సంబంధించిన జిల్లా అధ్యక్షులు జిల్లాలో పర్యటనలు చేసి వారి మోర్చాలకు సంబంధించిన కమిటీలను నియమించి క్షేత్ర స్థాయిలో పార్టీ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేయాలన్నారు.ం

# ఏఎస్ఓ జోడాల వెంకట్ చొరవతో వైద్య ఖర్చులకు ఆర్దిక సహాయం



**తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 30:**ఏఎస్ఓ జోడాల వెంకట్ ఆధ్వర్యంలో పెద్దేవం గ్రామానికి చెందిన జవ్వాది గంగా భవానికి ప్రమాదవశాత్తు రెండు కాళ్లు విరిగాయి. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం జోడాల వెంకటేశ్వరరావు వాట్సాప్ స్టేటస్ ద్వారా తెలుసుకొని లేఖరి రవి కృష్ణ 2 వేలు, జొన్నకూటి సుధాకర్ 1000 రూపాయలు, నాగాంజనేయులు 1000 రూపాయలు ఇచ్చారు. అదేవిధంగా స్నేహితులు తదితరులు అందించిన మొత్తం 11,500 రూపాయలను రాజమండ్రి విజయ హాస్పిటల్లో కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోడాల వెంకట్, రమాదేవి దంపతులు, దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ప్రత్తిపాటి నాగరాజు, కిషోర్ లు పాల్గొన్నారు.

# రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం





130 మందికి వైద్య సేవలు

**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 30:**రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల అధ్వర్యంలో సిరిగిందలపాడు లో ఆదివారం వైద్య శిభిరం నిర్వహించినట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిభిరం లో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు , డాక్టర్ పోతుల రామారావు , డాక్టర్ దాసరి ఉమా మహేష్ పాల్గొని సుమార130 మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు.అవసరం అయిన వారికి 55 మందికి రక్తపరీక్షలు,8 మందికి థైరాయిడ్ పరీక్షలు 3 ఇ.సి.జి లు ,ఒక్కరికీ ఎక్స్ రే , 8 ,మందికి ఫిజియథెరపీ లు చేసినట్లు స్వామీజి తెలిపారు. .రామ కృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ మీషన్ క్యాంపు ఇన్చార్జి స్వామి లోకమయానందా కోరారు..రోగులకు, సహాయకులు కు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.ఈ వైద్యశిబిరంలో రామక్రిష్ణ మిషన్ సిబ్బంధి , రామక్రిష్ణ మిషన్ వైద్య సేవల సమన్వయ కర్త కానుమొను శ్రీనివాస్,వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు.


# రైతులు కోతలు వాయిదా వేసుకోండి



జగ్గంపేట వ్యవసాయ అధికారి నరసింహం

**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 30:** దిత్వా తుఫాను వల్ల వర్షాలు పడే అవకాశం ఉన్న దృష్ట్యా రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని జగ్గంపేట వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం సూచించారు. ఆదివారం ఆయన జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో రైతులను కలిసి తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఇప్పటివరకు తొలకరిలో వేసిన 10,230 ఎకరాలకు గాను 7270 ఎకరాల వరకు కోతలు అయ్యాయన్నారు. రానున్న మూడు రోజుల్లో వర్షాలు అధికంగా ఉంటాయని రైతులు కోతలు, ఆకుమళ్లు తయారు చేసుకోవడం వాయిదా వేసుకోవాలని సూచించారు. కళ్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యాన్ని ఎత్తైన ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలన్నారు. ధాన్యం తడిసిపోకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# పదవీవిరమణ పొందిన ప్రసాద్ కు ఘన సత్కారం



**తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 30:** అన్నదేవరపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో పి.ఎస్.హెచ్.ఎం గా పనిచేస్తున్న గెడ్డం దైవ వర కృప ప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఇటీవల జూన్ లో జరిగిన బదిలీలలో ఆయన ఉద్యోగోన్నతి మీద ప్రస్తుత పాఠశాలకు రావడం జరిగింది. కార్యక్రమంలో ప్రసాద్ దంపతులను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మండలానికి చెందిన పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొని ఆయనను సత్కరించటం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారులు నెహ్రూ, బాలామణి పాఠశాలలో ఆయన చేసిన అభివృద్ధి పనులను కొనియాడారు. కార్యక్రమంలో ఎం.ఆర్.సి సిబ్బందితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు జి.రాజారత్నం, కె.ప్రసన్నకుమార్, బి.శంకరరావు, ఈ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల సృజనాత్మకతతో ముగిసిన గోదావరి బాలోత్సవం






విజేతలకు బహుమతుల ప్రదానం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ,నవంబర్ 30:**అబ్బురపర్చిన చిన్నారుల వివిధ రకాల వేషదారణలు..ఉర్రూతలూగించేలా జానపద నృత్యాలు చిన్నారుల్లో నిబిడీకృతమై శాస్త్ర సాంకేతికపరమైన ప్రయోగాలు, కోలాటాల మధ్య గోదావరి బాలోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. శనివారం ప్రారంభమైన గోదావరి బాలోత్సవంలో పాల్గొన్న చిన్నారులు వివిధ రంగాల వారీగా తమలో ఉన్న సృజనాత్మకత ప్రదర్శించారు. ఈ ఉత్సవంలో పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. గోదావరి బాలోత్సవంలో తమ ప్రతిభను చాటు కునేందుకు చిన్నారులు క్లాసికల్ డాన్స్, సైన్సు ప్రయోగాలు, గణిత ఫజిల్స్, జానపద నృత్యాలు, కోలాటం, లఘునాటికలు, జానపద, దేశభక్తి గీతాలాపన, విచిత్ర వేషదారణలు, బుర్రకథలతోపాటు, కార్టూన్లు, మట్టితో బొమ్మలు తయారీ, చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో చిన్నారులు, వారి తల్లీదండ్రుల, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనడంతో ఎస్కెవిటి డిగ్రీ కళాశాల ఆవరణ పండగ వాతావరణం మధ్య గోదావరి బాలోత్సవం ఘనంగా ముగిసింది.

విజేతలకు బహుమతుల ప్రదానం

గత రెండు రోజులుగా నిర్వహించిన గోదావరి బాలోత్సవంలో చిన్నారులకు వివిధ రంగాల వారిగా జూనీయర్స్, సీనీయర్స్ విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనీయన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు, ఎల్ఐసి సీనీయర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, ఆపుస్మా జిల్లా కార్యదర్శి పి.కళ్యాణ్ రెడ్డి, ఇండియన్ నేవి కెప్టెన్, ప్రముఖ చిత్రకారులు దామెర్ల రామారావు మనవుడు డెన్నిస్ దామెర్ల, స్వామి యాడ్స్ అధినేత జి. భాస్కర్, అమరావతి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.క్రాంతి కుమార్, గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి, గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి దాసరి సాయిబాబా, ఎస్టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.షరీఫ్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు కోలా సత్యనారాయణ, తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసి సీనీయర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు, కళారంగాలపట్ల ఆసక్తినీ పెంచు కోవాలన్నారు. అందుకు గోదావరి బాలోత్సవం దోహదం చేస్తుందన్నారు. పాఠశాలల యాజమాన్యాలు సైతం విద్యతోపాటు, విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ఆర్గనైజర్స్ నవీనకుమారి, ఆనంద్, వినోద్, పట్నాయక్, మురళి, అంజలి, గొల్లపల్లి సత్యనారాయణ, బుద్ధా శ్రీవాస్, విజరుబాబు, రాజేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత లక్ష్యం-సర్పంచ్ లక్ష్మణరావు



**కొవ్వూరు, పెన్ పవర్, నవంబర్ 30:**చిడిపి గ్రామానికి చెందిన ఎక్కిశెట్టి మోహన్ కు ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ లో కాలు విరిగి, సర్జరీ జరిగింది. మెడిసిన్, వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న అతనికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున 6 వేల రూపాయల ఆర్థిక సాయం చేయడమైనదని సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ తెలిపారు. కష్టాల్లో ఉన్నవారి ఒక్క కన్నీటిబొట్టునైనా తుడవాలన్నదే మానవత ధ్యేయమని అన్నారు. సంస్థ అధిక మొత్తం విద్య, వైద్య సేవల కోసం ఖర్చు పెడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు మాట్లాడుతూ కష్టాల్లోనూ, ఆపదలోనూ ఉన్నవారు మానవతను ఆశ్రయిస్తే తగు సహాయం చేస్తామని అన్నారు. సంస్థ ఫౌండర్ రామచంద్రా రెడ్డి ఆశయాల మేరకు మానవులకు సేవ చేయడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సనపల రాజశేఖర్, అప్పన వీర హనుమంతురావు, కొప్పాక వెంకటేశ్వరరావు, సాయన సుబ్బారావు, ప్రత్తిపాటి అబెద్నెగో, ఉండ్రాజవపు బంగారుబాబు తదిరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములు ఇరుముళ్ళు



**వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 30:** గురు స్వామి గురుమూర్తి ఆధ్వర్యంలో స్వాములకు ఇరుముళ్ళు కార్యక్రమం ఘనంగానే నిర్వహించారు.

45 రోజులు కఠిన ఆచార నియమాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన స్వాములు ఆదివారం ఇరుముళ్ళు కార్యక్రమాలు నిర్వహించారు. వై.రామవరం నుండి శబరిమలైకు స్వాములు ప్రయాణమయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఆలమూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమ్యూనిటీ హాలు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 30:**ఆదివారం ఆలమూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు భవన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గతంలో తన హయంలోనే పాస్టర్స్ ఫెలోషిప్ క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయడం జరిగిందని, ఇప్పుడు నిర్మాణం ప్రారంభం కావడం శుభపరిణామమని ఎమ్మెల్యే అన్నారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు.ి

ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కొత్తపేట జేఏసీ డేవిడ్ రాజు, మండల జేఏసీ సభ్యులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే బండారు చే ఎస్ ఎస్ సి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ.




**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 30:**ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముద్రించబడిన పదవ తరగతి మోడల్ పేపర్స్ స్టడీ మెటీరియల్ ను ఆలమూరు మండల యూటీఎఫ్ అధ్యక్షులు అద్దరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శాసన సభ్యులు బండారు సత్యనందరావు చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు 10వ తరగతిలో అత్యధిక శాతం ఉత్తీర్ణలు కావాలనే ఉద్ధేశంతో నిపుణులతో ఈ మెటీరియల్ తయారు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి విద్యార్థి దీనిలోని పాఠ్యాంశాలను చదవటం ద్వారా అత్యధిక మార్కులు సాధించగలుగుతారన్నారు. యుటిఎఫ్ నాయకులు చేస్తున్న కృషి అనిర్వచనయమని వారిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి తెలుగు దేశం పార్టీ పరిశీలకులు ఆకుల రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు ఈదల సత్తిబాబు, సొసైటీ చైర్మన్ వంటిపల్లి సతీష్, శ్రీ జనార్దన్ స్వామి ఆలయ చైర్మన్ బైరశెట్టి రాంబాబు మండల విద్యాశాఖ అధికారి ఎన్ రాజు 2 తదితరులు పాల్గొన్నారు.

# బ్రిటీష్ వారిని అదిలించిన నినాదం వందేమాతరం





### ఆలమూరులో వందేమాతరంఏ150పై కవి సమ్మేళనం

### ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన కవులు

### విజేతలకు బహుమతులు అందించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 30:**వందేమాతర నినాదం దేశభక్తుల గుండెలను పులకింపజేసిందని, సమర నినాదంగా మారి బ్రిటీష్ వారిని ఆదిలించిందని, భారత స్వాతంత్రానికి బాటలు వేసిందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. అలమారు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బాలమందిరం (సంధిపూడి), సాహితీగోదావరి (రామచంద్రపురం) సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వందేమాతరం ఏ 150 పై కవితల పోటీలు, కవి సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజేతలను, పాల్గొన్న కవులను సత్కరించారు. బహుమతులు అందజేశారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన కృష్ణ శ్రీ, ర్యాలి శ్రీనివాస్, గొడవర్తి శ్రీనివాస్ లను అభినందించారు.

తరలివచ్చిన కవులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన కవులు ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. సభాధ్యక్షునిగా ప్రముఖ కవి గౌరీ మల్లిక్ వ్యవహరించారు. రంగంపేటకు చెందిన శ్రీపాద సీతామహాలక్ష్మి వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు. న్యాయ నిర్ణేతలుగా ర్యాలి శ్రీనివాస్, గొడవర్తి శ్రీనివాస్ వ్యవహరించారు. కాకినాడకు చెందిన గరగరామకృష్ణ రచించిన పర్జన్య హుంకారం మొదటి బహుమతిని, జగ్గంపేటకు చెందిన బుగత యమున రచించిన వారసత్వ ఆయుధం రెండవ బహుమతి, ఆలమూరుకు చెందిన సూర్యాకుల రచించిన వందేమాతరం గీతం మూడవ బహుమతి సాధించాయి. ప్రత్యేక బహుమతులు శృంగారాయుని పాలెంకు చెందిన ఆర్ వి వి రాజా రచించిన దుర్గమ వరగీతం, అనపర్తికి చెందిన చాగంటి సుబ్రమణ్యం రాసిన కోన,కోన,కోనసీమ అందుకున్నాయి. కార్యక్రమంలో అనపర్తి తెలుగుదేశం పరిశీలకులు ఆకుల రామకృష్ణ సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు, డా. చల్లా రవికుమార్, స్వామి ప్రసాద్, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్, సాలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నివారణపై సైకిల్ ర్యాలీలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు




**కాకినాడ, పెన్ పవర్,నవంబర్ 30:**మాదకద్రవ్యాల వ్యసనాన్ని నిర్మూలించేందుకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో కాకినాడ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "డ్రగ్స్ వద్దు బ్రో" సైకిల్ ర్యాలీలో ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులు విస్తృతంగా పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆదిత్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు వెల్లడించారు. కాకినాడ జిల్లా ఈగల్ టీం సమన్వయంతో సర్పవరం జంక్షన్ నుండి భానుగుడి కూడలి వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముగింపు స్థలమైన భానుగుడి కూడలిలో విద్యార్థులు మానవ హారం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పోలీసు అధికారులు యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా లక్ష్యసాధన కోసం కృషి చేయాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కొత్త పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రలోభపెట్టే వ్యక్తులను నమ్మవద్దని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాల కేసులకు సంబంధించిన శిక్షలు, 1972 టోల్ ఫ్రీ నెంబరు ప్రాధాన్యతపై వివరాలు అందించారు. వ్యసనాల వల్ల వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా తీవ్ర నష్టాలు వాటిల్లుతాయని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టీ. తేజేశ్వరరావుతో పాటు వాలంటీర్లను పోలీసు అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగం సేవలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు ప్రశంసించారు.

# శ్రీ జనార్ధన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు.




**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 30:**ఉమ్మడి జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన నవ జనార్ధన స్వామి ఆలయాల్లో ఒకటైన శ్రీశ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ విశిష్టతను పురస్కరించుకుని హైదరాబాద్ తో పాటు శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఆలయ అర్చకులు అంగర భగవాన్ సాయి ఆచార్యులు వేద మంత్రోచ్చారాణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా భక్తులు ఆలయ విశిష్టతను స్థానిక కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాచీన చరిత్ర కలిగి నారద మహామునిచే ప్రతిష్టించబడ్డ ఈదేవాలయ గొప్పతనాన్ని ప్రసార మాధ్యమాల్లో తెలుసుకుని ఆలయానికి తరలి వచ్చినట్లు భక్త మహిళలు వ్యాఖ్యానించారు. స్వయంభుగా వెలసిన జనార్ధన్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. నాలుగు శనివారాలు, నాలుగు ప్రదక్షిణలు తమను విశేషంగా ఆకట్టుకుందని భక్తులు తెలిపారు.

### మండల శ్రీ సూర్య గాయత్రి బ్రహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షునిగా మేడవరపు లక్ష్మణరావు.



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 30:**మండలంలోని చింతలూరులో నున్న బ్రహ్మణ కమ్యూనిటీ హాలు లో ఆదివారం శ్రీ సూర్య గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షులుగా చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, అల్లంరాజు రామకృష్ణ మూర్తి, అధ్యక్షులుగా మేడవరపు లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా కూచిబట్ల శివ, కార్యదర్శిగా వేదుల లక్ష్మణశర్మ, ఉపాధ్యక్షులుగా మద్దూరి సుబ్రహ్మణ్య శాస్త్రి, కోశాధికారిగా చర్ల కృష్ణ హనుమాన్ తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు. నూతన కార్యవర్గాన్ని సహచర సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

# వైభవంగా బడుగువానిలంక దుర్గమ్మ తీర్ధ మహెూత్సవం.





**ఆలమూరు,పెన్ పవర్,నవంబర్ 30:**పచ్చని పంట పొలాలు,పూల తోటల మధ్య వేంచేసి ఉన్న విజయ దుర్గమ్మ వారి తీర్థ మహెూత్సవం ఆదివారం ఎంతో వైభవంగా జరిగింది. లంక రైతుల ఆరాధ్య దైవంగా ఈ అమ్మవారిని కొలుస్తారు. ఈ లంక భూముల్లో సాగయ్యే పూల,కూరగాయ, వాణిజ్య పంటలకు ఈ అమ్మవారు అండగా ఉంటారని రైతుల నమ్మకం. అందుకునే ఈ లంకల్లో భూములున్న ఆలమూరు మండలంతో పాటు కడియం, ఆత్రేయపురం, రావులపాలెం మండలాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున కుటుంబ సభ్యులతో ఇక్కడికి తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. పలువురు అమ్మవారి పటిక బెల్లంతో తులాభారం ఇచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. అలాగే లంక గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఈ అమ్మవారి తీర్ధ మహెూత్సవంకు విచ్చేసారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా ఆలయ కమిటీ వారు విద్యుత్ అలంకరణతో తీర్చిదిద్దారు. అలాగే పలు సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఆలమూరు ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com